




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1  సంచిక : 320  పేజీలు :8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : ఒంగోలు  బుధవారం 22 జూలై 2026  వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :320 PAGES :8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : ONGOLE  WED 22 JULY 2026  PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

- కాకినాడ పోర్ట్ పరిసరాల్లో 'NBK111' షూటింగ్
- యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా కాలుజారి కిందపడ్డ బాలయ్య
- గాయం స్వల్పమైనదేనని ప్రకటించిన వైద్యులు

- మిగతా 2లో






## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

- యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స
- కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని వెల్లడి
- స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి దోపిడీ చేస్తున్నారని ఆరోపణ

2లో



## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

### రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

- మిగతా 2లో

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.



# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..

## దావోస్ ఒప్పందానికి కీలక ముందడుగు

- దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రం లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటె డ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళ వారం రాష్ట్ర సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావ



డంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయను న్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరు స్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసె సింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.



## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

### నిమ్మల రామానాయుడు

- వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల
- నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని వ్యాఖ్య

- మిగతా 2లో



## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ మాట మార్చారు



### కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

- నీట్‌పై చర్చ విషయంలో రాహుల్ గాంధీ మాట మార్చారని కేంద్రం ఆరోపణ
- ప్రధాని నివాసం సమీపంలో కాంగ్రెస్ నిరసన.. పాల్గొన్న రాహుల్, ప్రియాంక
- ధర్నా వద్దకు వెళ్లి రాహుల్‌తో మాట్లాడిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- మంత్రుల రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్.. చర్చలు విఫలమయ్యాయని ప్రకటన

- మిగతా 2లో

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

### సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

- భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు
- దీని వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని వ్యాఖ్య
- జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన అంశమన్న సుప్రీంకోర్టు

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. "ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం" అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.


## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..!

**అయ్యవారి బాగోతాలు - 4**

- అద్దెకు ఇల్లు ఇచ్చాడు.. చివరకు శవమై మిగిలాడు..!
- నిడదవోలు అద్దె ఇంటి నుంచి మొదలైన వివాదం.. భీమడోలు వరకు సాగుతున్న ఆరోపణల నీడ
- పత్రాలు ఎక్కడ..? కలప సామగ్రి ఏమైంది..?
- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయా..?
- "ఏం చేయాలో అదే చేస్తా" అన్న బెదిరింపుల వెనుక నిజమెంత..?
- ఇంటి యజమాని మృతి.. మిస్టరీగా మిగిలిన ప్రశ్నలు
- ఆ మరణంపై సమగ్ర విచారణ జరిగితే.. మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయి..?
- లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగవన్న ఆరోపణలు.. సమగ్ర దర్యాప్తుకు బాధిత ప్రజల డిమాండ్




**అద్దెకు ఇల్లు ఇచ్చాడు. ప్రభుత్వ అధికారి కాబట్టి పర్వాలేదనుకున్నాడు. తన ఇంట్లోకి వచ్చిన వ్యక్తిని నమ్మాడు. తన పొలం పత్రాలు రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చాడు , కానీ ఆ నమ్మకమే చివరకు తన కుటుంబానికి కన్నీటి కథగా మిగిలిందా..? ఇంటి నుంచి విలువైన కలప సామగ్రి మాయమైందని ఆరోపణలు. భూమికి సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వలేదన్న వాదనలు. దీనిపై అధికారులను ఆశ్రయించినా స్పందన లేదన్న ఆవేదన. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నట్లుగా బెదిరింపులు ఎదురయ్యాయన్న బాధిత కుటుంబం వాంగ్మూలం. ఆ తర్వాత.. ఇంటి యజమాని మృతి. ఇది సాధారణ మరణమా..? లేక తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులు, అవమానాలు, న్యాయం కోసం చేసిన పోరాటం మధ్య చోటుచేసుకున్న అనుమానాస్పద మరణమా..? ఇదే ఇప్పుడు అందరికీ మిస్టరీగా మారిన ప్రశ్న.**

**ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు/భీమడోలు, జూలై 21:**



వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్‌పై సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. గతంలో వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో నిడదవోలులోని అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చింది. వివాహేతర సంబంధం, ఇంటి సామగ్రి చోరీ, భూమి పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడం, ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు, అవినీతి ఆరోపణలు వంటి పలు అంశాలను ఇంటి యజమాని కుటుంబ సభ్యులు పెన్ పవర్ ఎదుట వెల్లడించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిడదవోలుకు చెందిన లేటు జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం కుటుంబ సభ్యులు జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించిన ఫిర్యాదు, బాధితురాలు జయమ్మ వెల్లడించిన వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.


**అద్దె ఇంటి నుంచే వివాదానికి బీజం..? :** ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం భార్య జయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో నిడదవోలులోని అల్లూరి సీతారామరాజు వీధిలో ఉన్న తమ ఇంటిని అద్దెకు తీసుకున్నారని తెలిపారు. అద్దెకు దిగే సమయంలో తాను తన భార్యతో కలిసి నివసిస్తానని చెప్పినప్పటికీ, అనంతరం శోభారాణి అనే మహిళతో కలిసి ఇంటిలో నివసించారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై తమ కుటుంబంలో వివాదం తలెత్తిందని, అనంతరం అద్దె ఇంటిలోని విలువైన కలప సామగ్రి, ఇతర వస్తువులు కనిపించకుండా పోయాయని జయమ్మ ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన పొలాల పత్రాలను కూడా తీసుకెళ్లి ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని ఆమె వాపోయారు.

**"పత్రాలు తీసుకెళ్లారు.. తిరిగి ఇవ్వలేదు" :** తమ భూములకు సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని జయమ్మ ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న చోరీపై కూడా జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తమ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించినా స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన తర్వాత తమ కుటుంబంపై ఒత్తిళ్లు పెరిగాయని, ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వచ్చినట్లు ఆమె ఆరోపించారు.

**"కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నారా..? :** తమ కుటుంబం చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ నుంచి బెదిరింపులు వచ్చాయని జయమ్మ ఆరోపించారు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అంటూ బెదిరించారని ఆమె పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన భర్త జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఆ తర్వాత ఆయన మరణించారని జయమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్త మరణానికి ముందున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె కోరారు. అయితే, బెదిరింపుల కారణంగానే ఆయన మృతి చెందారనే ఆరోపణకు సంబంధించి అధికారిక దర్యాప్తు ద్వారా వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది.

**జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు.. అయినా చర్యలేవీ లేవా..? :** అద్దె ఇంటిలో దొంగతనం జరిగిందంటూ ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదులో ఇంటి నుంచి వస్తువులు తీసుకెళ్లడం, పత్రాలు తిరిగి ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రస్తావించినట్లు వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత శాఖ నుంచి తగిన స్థాయిలో స్పందన రాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? విచారణ జరిగిందా..? ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై శాఖాపరంగా ఏమైనా నివేదిక రూపొందించారా..? అన్న విషయాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

**అధికారిక విధుల్లోనూ అవినీతి ఆరోపణలు..? :** ఇదిలా ఉండగా, వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ గతంలో అనంతపల్లి, వేగేశ్వరపురం ప్రాంతాల్లో పనిచేసిన సమయంలోనూ, ప్రస్తుతం భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయంతో కార్యాలయ వ్యవహారాలు సాగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల పాత్ర పెరిగిందని, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి




నిర్దిష్ట ఆధారాలు, అధికారిక విచారణ నివేదికలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**విచారణకు ప్రజల డిమాండ్ :** ఒక ప్రభుత్వ అధికారి చుట్టూ ఇంతటి తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్టాంపులు--రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు అద్దె ఇంటి వివాదం, ఇంటి సామగ్రి అదృశ్యం, భూమి పత్రాల వ్యవహారం, ఫిర్యాదు ఉపసంహరణకు వచ్చినట్లు చెబుతున్న బెదిరింపులు, ఇంటి యజమాని మృతికి ముందు జరిగిన పరిణామాలు, అలాగే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు-ఈ అంశాలన్నింటినీ విడివిడిగా కాకుండా సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. బాధిత కుటుంబం చేసిన ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అదే విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కొసమెరుపు ఏంటంటే**

వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ పనిచేసిన ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో ఒక ప్రైవేట్ మహిళ కీలక పాత్ర పోషిస్తుందనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరి దీనిపై ఉన్నత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే, అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు. అభిప్రాయ డుతున్నారు. ఒకవేళ ఆరోపణల్లో నిజానిజాలు ఉంటే ప్రభుత్వం విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు."

**అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో ఆంటీ... ఆ నలుగురు యవ్వారం... ఏంటో... చూద్దాం..? ఎపిసోడ్ 7 లో.**

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

- మొదటి పేజి తరువాయి

ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి.

చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు.నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు.పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు.

## రాహుల్ గాంధీ మాట మార్చారు

నీట్-యూజీ పరీక్ష వివాదంపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పినా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి నిమిషంలో మాట మార్చారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీంతోప్రతిష్టంభన ఏర్పడిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు రాహుల్ కట్టుబడలేదని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి కొత్త షరతులు పెట్టడంతో చర్చలు ముందుకు సాగలేదని ఆయన విమర్శించారు.

నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని ప్రధాని నివాసం సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ధర్నా ప్రారంభమైన గంట తర్వాత మంత్రి జితేంద్ర సింగ్ అక్కడికి చేరుకుని రాహుల్‌తో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. నీట్ అంశంపై చర్చ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందని, కానీ ఆ తర్వాత రాహుల్ గాంధీ మరో కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడంతో చర్చలు విఫలమయ్యాయని జితేంద్ర సింగ్ వివరించారు.

మరోవైపు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నీట్ వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో తమ నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ నేతలు ప్రకటించారు.

# జాడలేని కొత్త సామాజిక పింఛన్లు

- రెండున్నరేళ్లుగా కొత్త లబ్ధిదారులకు నిరీక్షణే
- అర్హులైన పేదల్లో పెరుగుతున్న ఆందోళన
- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కిడ్నీ
- క్యాన్సర్ బాధితులకు పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- పెండింగ్ దరఖాస్తులపై స్పష్టత కోరుతున్న లబ్ధిదారులు




**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం, జూలై 21**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొత్త సామాజిక పింఛన్ల మంజూరులో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వేలాది మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కిడ్నీ, క్యాన్సర్ బాధితులు, డప్పు కళాకారులు తదితర వర్గాలకు చెందిన వారు కొత్త పింఛన్లు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. పింఛన్ లేని కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, కొందరు వృద్ధులు అనారోగ్యంతో మంచానికే పరిమితమై బంధువుల సహాయంపైనే ఆధారపడుతున్నారని గ్రామాల్లో వినిపిస్తున్న వేదన. మరికొందరు ఉపాధి లేక ఆలయాల వద్ద, రహదారుల పక్కన బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**పింఛనే జీవనాధారం...**

ప్రస్తుతం సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఆ నగదుతోనే తమ నిత్యావసరాలు తీర్చుకుంటున్నారు. మందులు కొనుగోలు చేయడం, వైద్య ఖర్చులు భరించడం, ఆహార అవసరాలు తీర్చుకోవడం వంటి వాటికి పింఛనే ప్రధాన ఆధారంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో కొత్తగా అర్హత సాధించిన వారికి పింఛన్లు మంజూరు కాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని బాధితులు చెబుతున్నారు.

**ఆంక్షలతో పరిమిత మంజూరు?...**

కొత్త సామాజిక పింఛన్ల మంజూరులో ప్రభుత్వం పలు నిబంధనలు అమలు చేస్తోందని, వాటి కారణంగా అర్హులైన చాలామంది పేదలకు లబ్ధి అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో మాత్రమే వారసురాలైన భార్యకు పింఛన్ బదిలీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నారని, అయితే కొత్త అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి మాత్రం కొత్తగా మంజూరులో పురోగతి కనిపించడం లేదని అంటున్నారు.

**పెండింగ్ దరఖాస్తుల పరిస్థితి ఏంటిలి?...**

గత ప్రభుత్వ హయాంలో 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు గ్రామ సచివాలయాల ద్వారా వేలాది మంది సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించినప్పటికీ, వాటిలో చాలావరకు ఇప్పటికీ పరిష్కారం కాలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ పెండింగ్ దరఖాస్తులపై సమగ్ర నిర్ణయం వెలువడకపోవడంతో పేదలు నిరాశలో ఉన్నారు. కొత్త దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, మంజూరు ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**వైద్య బాధితుల ఆవేదన...**

కిడ్నీ, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న అనేక మంది రోగులకు నెలవారీ వైద్య ఖర్చులు భారంగా మారాయి. సామాజిక పింఛన్ వస్తే కొంతైనా మందుల ఖర్చు భరించవచ్చనే ఆశతో ఎదురు చూస్తున్నామని వారు చెబుతున్నారు. పింఛన్ ఆలస్యం కావడంతో అప్పులు చేసి చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల కష్టాలు...**

60 సంవత్సరాలు దాటిన వృద్ధుల్లో చాలామంది ఉపాధి చేసుకునే స్థితిలో లేరు. దివ్యాంగులకు కూడా ఉద్యోగ అవకాశాలు లేక కుటుంబ సభ్యులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడం వారి జీవనోపాధిని మరింత కష్టతరం చేస్తోందని అంటున్నారు.

**హామీల అమలుపై ప్రశ్నలు...**

ఎన్నికల సమయంలో వివిధ వర్గాలకు సామాజిక భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి వృద్ధుడు, వితంతువు, ఒంటరి మహిళ, దివ్యాంగుడు, కిడ్నీ, క్యాన్సర్ బాధితుడు వంటి వారికి కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేసి జీవన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పేదల విజ్ఞప్తి...**

కొత్త సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది అర్హుల పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలని, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు కోరుతున్నారు.

# పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

## మార్కాపురం - ప్రకాశం

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

మీకోసం ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమములో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్.ఓ.ఆర్, అసైన్మెంట్స్, రీ సర్వే, పట్టాదారు పాస్ పుసకాల పంపిణీ పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. గ్రీవెన్స్ అర్జీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు / సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలను పంపించాలని ఆదేశించారు. భూములు రీ- సర్వే ప్రక్రియను ఎన్ని మండలాలు పూర్తి చేశారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన మండలాల్లో సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఆర్ ఓ ఆర్ సమస్యల పైన దృష్టి సారించి పరిష్కరించాలని తెలిపారు.' మీకోసం ' అర్జీల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీచేసిన సర్క్యులర్ల పైనా డివిజన్, మండల స్థాయి రెవిన్యూ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా కలెక్టర్ చెప్పారు. అర్జీదారులను కోర్టుకు వెళ్లాలని చెప్పటం కాకుండా రెవెన్యూ అధికారులే మరింత దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలనీ ఆయన స్పష్టం చేశారు. పి.జి.ఆర్.యస్.కి సంబంది0చి వచ్చిన అర్జీలను పరిశీలించి రెవిన్యూ,భూ సమస్యలు, ఫ్యామిలీ సంబందిత సమస్యలు లాంటివి విడి విడిగా చేసి వాటిని క్షేత్రస్తాయిలో పరిశీలించి అవరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధముగా రోజుకు రెండు విషయాలమీద దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గ్రీవెన్స్, భూ విభాగాల సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ఇంటూరి దృష్టి

## -గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరణ.. -అధికారులకు తక్షణ ఆదేశాలు






**కందుకూరు, పెన్ పవర్, జూలై 21**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల (గ్రీవెన్స్) కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేస్తూ పరిష్కారం కోరుతున్నారు. గ్రీవెన్స్‌లో ప్రధానంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు, ఇళ్ల స్థలాలు, సామాజిక పింఛన్లు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, భూ రికార్డుల సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పిస్తున్నారు. అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, రెవెన్యూ రికార్డులు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలులో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు. గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తోందని, అర్జీలపై సంబంధిత శాఖల ద్వారా చర్యలు చేపడుతున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# ఎమ్మెల్యే దామచర్ల ప్రజా దర్బార్.. 86 అర్జీలు రాక

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 21**

ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు తమ సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకురాగా, ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్ లో ప్రజల నుండి 86 అర్జీలను స్వీకరించారు.

**మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ స్కూల్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో...**

ముస్లింలు ఎక్కువగా నివసించే ఐదు డివిజన్ ల కూడలి ప్రాంతంలో కోటావీధి ఉర్దూ స్కూల్ ఉందని అందరికీ అందుబాటులో ఉండేలా గతంలో ఎక్కడైతే ఉర్దూ పాఠశాల స్థలం ఉందో అక్కడే పాఠశాల ను పునర్నించాలని స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ముస్లిం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అర్జీని పరిశీలించి తప్పకుండా ఉర్దూ పాఠశాల నిర్మాణానికి తన ప్రయత్నం చేస్తానని, సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల తెలియజేశారని ముస్లిం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉర్దూ స్కూల్ పరిరక్షణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ కరిముల్లా, పఠాన్ కరిముల్లా ఖాన్, షేక్ మహ్మద్ రఫీ, షేక్ మహబూబ్ బాషా,సయ్యద్ హుస్సేన్, షేక్ సిలార్, షేక్ హిదాయతుల్లా, పఠాన్ సమీర్ ఖాన్, షేక్ ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

**ఒంగోలులోని బిసి హాస్టల్ సమస్య పరిష్కరిస్తాం...:** ఒంగోలులోని పీ.వీ.ఆర్ బాలుర పాఠశాలలో, బీసీ హాస్టల్లో గదుల కేటాయింపు, 150 మంది విద్యార్థుల సమస్యలపై విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత డీఈవో, బీసీ సంక్షేమ అధికారిణితో మాట్లాడారు. విద్యార్థులకు త్వరలోనే న్యాయం చేస్తామని, హాస్టల్ సమస్యను పరిష్కరిస్తామని దామచర్ల భరోసా ఇచ్చారని విద్యార్థి జేఏసీ నాయకులు తెలిపారు.

# ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడును కలిసిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సీఎం కు వివరించారు ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టేందుకు అవసరమైన నిధులు, ప్రణాళికలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. గిద్దలూరులో ఆధునిక పార్కు నిర్మాణం, కంబం చెరువు అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధుల విడుదల, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా గిద్దలూరు సగిలేరు వాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణం, చెక్‌డ్యామ్ ఏర్పాటు అత్యవసరమని, దీనివల్ల వరదల నివారణతో పాటు భూగర్భ జలాల పెరుగుదల, రైతులకు , ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని వివరించి, ఈ పనులకు తగిన పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు.



# రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

**-జీవో నెం. 396 ఉపసంహరించాలంటూ ఎమ్మెల్యే ఇంటూరికి డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండార్ల వినతి**



**కందుకూరు, పెన్ పవర్, జూలై 21**

రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖను ప్రైవేటీకరించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఇందుకు సంబంధించిన జీవో నెం. 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండార్లు మంగళవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖను ప్రైవేటీకరించే నిర్ణయం అమలైతే డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండార్లతో పాటు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించి జీవో నెం. 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఉద్యమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు ప్రకటించి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కోకా రంగారావు, వరికూటి శివరాం, బక్కమంతల నరసింహం, పూరిమిట్ల రవి తదితరులు ఉన్నారు.

## అంకమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దివి బ్రదర్స్

**-నందనవనం గ్రామంలో పారా వారి కొలుపులకు హాజరు**



**కందుకూరు, పెన్ పవర్, జూలై 21:**

జరుగుమల్లి మండలం నందనవనం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అంకమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం, పారా వారి కొలుపుల కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పారా జనార్ధన్ ఆహ్వానం మేరకు కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, దివి రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు, భక్తులతో కలిసి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పారా వైష్ణవ్ చౌదరి, పారా చైతన్య, పారా సూర్యతేజ, పారా మనోజ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు అతిథులకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

## అమ్మవారి కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు పెన్ పవర్, జూలై 21:**

కొండపి నియోజకవర్గం నందనవనం గ్రామంలో పారా వారి శ్రీ అంకమ్మ తల్లి కొలుపుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ని ఘనంగా సన్మానించారు. నందనవనం గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెం గ్రామంలో నిర్వహించిన నల్లూరి, నర్రా, కోడెల వారి దేవర కొలుపుల కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తో కలిసి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని దేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఏపీఈడబ్ల్యుఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, వార్డు టీడీపీ అధ్యక్షుడు చుండూరి మాల్యాద్రి, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ్ శ్రీనివాస్, గ్రామ నాయకులు నల్లూరి యలమంద, రమేష్, సుబ్బారావు, మాధవరావు, పాతూరి మాలకొండయ్య, కామణి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**-నెలవారీ నేర సమీక్ష సమావేశంలో డీఎస్పీ ఆదేశాలు**

**-మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం**

**- గంజాయి, పేకాట, కోడిపందాల నిర్మూలనపై దృష్టి**





**కందుకూరు, పెన్ పవర్, జూలై 21:**

కందుకూరు సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో చట్టానికి సంబంధించిన కేసులు, వృద్ధులపై నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు, సైబర్ నేరాలు, అదృశ్యమైన వ్యక్తుల కేసులు, అనుమానాస్పద మృతుల కేసులు, మోసాలకు సంబంధించిన కేసులతో పాటు ఇతర పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. అన్ని పెండింగ్ కేసులను వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీఎస్పీ ఆదేశించారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందాలు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి రహదారి భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో కందుకూరు, గుడ్లూరు, కొండేపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వి.వి.పాలెం, కొండేపి, పొన్నలూరు, మర్రిపూడి పోలీసు స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# రామాయపట్నం పోర్టు ప్రజల కోసమా, కార్పొరేట్ల కోసమా

## - సిపిఎం జిల్లా నాయకులు జీ. వీ కొండారెడ్డి



**కందుకూరు పెన్ పవర్, జూలై 21**

రామాయ పట్నం పోర్టు ప్రజల కోసమా?, కార్పొరేట్ల కోసమా అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం కందుకూరు సుందరయ్య భవన్ లో సిపిఎం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీ.వీ కొండారెడ్డి మాట్లాడుతూ రామాయ పట్నం పోర్టు ప్రభుత్వ రంగంలో నిర్మిస్తామని చెప్పి భూ సేకరణ చేశారు. ప్రజా ప్రయోజనాలకు, కందుకూరు ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆశతో భూములను ఇవ్వడం జరిగింది. వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, మొదటి దశ పూర్తి కావస్తున్న దశలో రాష్ట్ర ప్రభుత్వం, దీనిని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలనుకోవడం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వ ఆధీనంలో పోర్టు ఉంటే ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ప్రైవేటు వ్యక్తులకు, ముఖ్యంగా ఈ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే కందుకూరు ప్రాంత ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలిగే పరిస్థితులు ఉండవని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పరంగా నిర్మాణం జరుగుతుంటేనే, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు, కూలి పనులు కూడా ఇవ్వని పరిస్థితి ఉందంటే,రేపు ప్రైవేటు వ్యక్తులు ఉద్యోగాలు ఇస్తారనే నమ్మకం ఎక్కడ ఉంది అన్నారు. అందుకే రామాయపట్నం పోర్టును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణం పూర్తి చేయడానికి డబ్బులు లేవని సాకుగా ప్రభుత్వం చెప్తుంది. నిర్మాణం పూర్తి అవుతున్న దశలో, బహుళ జాతి కంపెనీలకు పోర్టును అప్పగించి, అందులో 12 శాతం ప్రభుత్వ వాటాగా తీసుకుంటే, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నామమాత్రంగానే ఉంటుంది. లక్షల కోట్ల రూపాయలు సొంతం అవుతుంది. ఇప్పటికే రామాయపట్నం పోర్టు ఆధారంగా బిపిసిఎల్, ఇండోసోల్ కంపెనీల తోపాటు జిందాల్ వంటి కంపెనీలు ఏర్పాటుకు సిద్ధమయ్యాయన్నారు. ఇంత పెద్ద ఎత్తున కందుకూరు ప్రాంతంలో అభివృద్ధి జరుగుతున్న తరుణంలో రామాయపట్నం పోర్టు కార్పొరేట్లకు ఇవ్వాలనుకోవడం ప్రభుత్వ అవివేక చర్యగా సిపిఎం పేర్కొన్నది. పోర్టును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలనే అభిప్రాయంతో ప్రజలను సమీకరించి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామని కొండారెడ్డి చెప్పారు. కలసి వచ్చే వారందరినీ కలుపుకొని, రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ నిర్వహిస్తామని చెప్పారు. రామాయపట్నం పోర్టు అభివృద్ధి గురించి అఖిలపక్ష సమావేశం ప్రభుత్వం నిర్వహించాలని, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్లాలని ప్రభుత్వాన్ని కి సూచించారు. రామాయపట్నం పోర్టు విషయాన్ని రాజకీయ వాద ప్రతి వాదాలకు కాకుండా, కందుకూరు ప్రాంత అభివృద్ధికి సింబాలిక్ గా చూడాలని ఆయన సూచించారు.

**రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండో సోల్ కంపెనీలలో స్థానికులకు ఉద్యోగాలు యివ్వాలి**

రామాయపట్నం పోర్టు నిర్మాణం జరిగితే ఆ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వం ఆధీనంలోనే పోర్టు నిర్మిస్తామని చెప్పటంతో,ఈ ప్రాంత నిరుద్యోగులు, ప్రజలు తమకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆశించారు. ఇప్పటివరకు కేవలం 5 శాతం మాత్రమే ఉద్యోగాలు రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ ఉద్యోగాలు చేస్తున్న పరిస్థితి. రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ జరిగితే కందుకూరు ప్రాంత నిరుద్యోగులకు, ప్రజలకు ఉద్యోగ అవకాశాలు ఉండే పరిస్థితి ఉండదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ మూడు కంపెనీలలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో సిపిఎం కందుకూరు నియోజకవర్గ నాయకులు జి వెంకటేశ్వర్లు, ఎస్ ఎ గౌస్, జీవీబీ కుమార్ లు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీలో వార్డు సెక్రటరీలు, మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు సామర్థ్య వృద్ధి , నైపుణ్యాభివృద్ధి శిక్షణ







**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో, నాలెడ్జ్ పార్ట్నర్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సహకారంతో గిద్దలూరు మున్సిపాలిటీలో వార్డు సెక్రటరీలు మెప్మా రిసోర్స్ పర్సన్స్ కోసం సామర్థ్య వృద్ధి , నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణ బాబు, మేనేజర్ స్నేహలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణ బాబు మాట్లాడుతూ, స్వచ్ఛమైన పట్టణ నిర్మాణంలో వార్డు సెక్రటరీలు మెప్మా రిసోర్స్ పర్సన్స్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, ఇంటి వద్దే తడి-పొడి చెత్త వేరు చేయించడం, హోం కంపోస్టింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా వ్యర్థాల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రజలతో సమన్వయం చేసుకొని స్వచ్ఛ గిద్దలూరు లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రిసోర్స్ పర్సన్స్ వై. జయ మధురిమ , డి. కోటేశ్వరరావు సాయిల్డ్ వెస్ట్ మేనేజమెంట్ రూల్స్ -- 2026, హోం కంపోస్టింగ్, ప్రవర్తనా , సామాజిక ప్రవర్తన మార్పు , తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఇంటి వద్దే సేంద్రియ వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణ వ్యయం తగ్గుతుందని వివరించారు. ప్రజలలో అలవాట్ల మార్పు తీసుకురావడానికి సమర్థవంతమైన కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, స్వచ్ఛత సందేశాల వ్యాప్తి, స్థానిక సంఘాల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే ఆర్ ఆర్ ఆర్ కేంద్రాల ప్రాముఖ్యత, పునర్వినియోగం చేయగల వస్తువుల సేకరణ, వనరుల సంరక్షణ మరియు వృత్తాకార ఆర్థిక వ్యవస్థ లో వాటి పాత్రను వివరించారు. ఈ శిక్షణ ద్వారా వార్డు స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపాలిటీ వార్డు సెక్రటరీలు మెప్మా, రిసోర్స్ పర్సన్స్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంక భూపాలపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 21**

మండలంలోని అంకభూపాలపురం మరియు పోలినేని చెరువు గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.వి.ఎల్. దుర్గ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2026 సంబందించిన పంట భీమా పిఎంఎఫ్ బివై రైతులకు అవగాహన కల్పించారు. మరియు ప్రస్తుతం ఎల్ ని నో ప్రభావం గురించి, నీటి యాజమాన్యంపై తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ, సంతోష్, హరికృష్ణ మరియు వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది సంబంధిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మక్కెనవారిపాలెంలో దొంగల హల్ చల్

**భయాందోళనలో మహిళలు, వృద్ధులు**



**సంతమాగులూరు, పెన్ పవర్,జూన్ 21**

మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో దొంగల అరాచకాలు పెరుగుతున్నాయి. గతంలో రామాలయం బజారులో జరిగిన దొంగతనం ఘటనతో స్థానికులు భయపడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రాత్రి వేళల్లో తిరగడం దుర్భరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. దొంగల భయంతో రోజువారీ పనులకు కూడా ఆటంకం ఏర్పడుతోందని మహిళలు వాపోయారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసు గస్తీ పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పి ఎం ఈ బస్ సేవా స్కీమ్ పై ఎం పి మాగుంట ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 21**

ఢిల్లీ లోని పార్లమెంట్ భవనం లోని మెయిన్ కమిటీ హాల్ లో గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పీఎం-ఈబస్ సేవా పథకం అంశంపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగినది. గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో పీఎం-ఈబస్ సేవా పథకం అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వం (పట్టణాభివృద్ధి శాఖ, నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్), నాసిక్ మహానగర్ పరివహన్ మహామండల్ లిమిటెడ్ ప్రతినిధులు), ఫేం పథకం కింద ఎలక్ట్రిక్ బస్సు సేవల నిర్వహణపై పూణే మునిసిపల్ కార్పొరేషన్, పూణే మహానగర్ పరివహన్ మహామండల్ లిమిటెడ్ ప్రతినిధులతో చర్చించారు. పీఎం- ఈబస్ సేవా పథకం అంశంపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం రవాణా శాఖ, డెహ్రాడూన్ సిటీ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

# 2026-27 సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్

## భీమా యోజన భీమా క్రింద రైతు లే ప్రీమియం చెల్లించాలి





**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

గిద్దలూరు మండలం లో కొత్తకోట , వేములపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2026-27 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, వాతావరణ ఆధారిత భీమా పథకం కింద రైతులు స్వతహాగా వారే పంట భీమా కి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్ లో మార్కాపురం జిల్లా లో వరి, కంది, సజ్జ, నువ్వులు, మినుములు,ఎండు మిరప పత్తి మొదలైన పంటలు పంటల బీమా పథకం కింద వర్తిస్థాయని తెలిపారు.పంట భీమా కంది, సజ్జ, మినుములు, నువ్వులు,ఎండు మిరప, పత్తి పంటలకు కి ఈ నెల 31వరకు వరి పంట కి ఆగస్టు15. వరకు గడువు తేదీ అని తెలిపారు. పంటలు భీమా చేయదల్చిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని దగ్గర లోని మీ-సేవ,సీఎస్ సి సెంటర్, బ్యాంక్ లు మొదలైన చోట పంట భీమా కి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమా కి నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకి ఎకరాకి రూ.860/-,కంది పంట కి ఎకరాకి రూ. 430/-, సజ్జ పంటకి ఎకరాకి రూ. 156/- మినుములు కి రూ.205/-, నువ్వులు కి రూ. 180/-,ఎండు మిరప కి ఎకరాకి రూ.4500/-, పత్తి కి రూ. 2100/- ఎకరాకి కట్టి పంట భీమా కి నమోదు చేసుకోవాలని సూచించారు.అతివృష్టి , అనావృష్టి సంభవించినప్పుడు సాధారణంగా పంటల దెబ్బతింటాయి కావున ఆ సమయంలో పంటల బీమా పథకం రైతులకు బాగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్వేత పాల్గొని రైతులకు ఉద్యానవన శాఖలో అందే వివిధ రాయితీలు, ఉద్యాన పంటలలో వచ్చు,చీడ పీడలు , వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. గ్రామ సభ అనంతరం గ్రామంలోని పత్తి , ఆముదం పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు వాటి నివారణ చర్యలు రైతుల కు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్ వలి, గోవింద్ భాష రైతులు పాల్గొన్నారు.

## పరిమిత సంరక్షకుని నియామక ధృవీకరణ పత్రం



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 20**

దివ్యాంగుని.. నమోదిత సంస్థ..వికలాంగుడి తల్లిదండ్రులు లేదా బంధువులు చేసిన దరఖాస్తును పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు గారు మానసిక దివ్యాంగులైన జి.శ్యామ్ బాబుకు ఒక సంవత్సర కాలానికి జి. అనిల్ కుమార్ ని పరిమిత సంరక్షకునిగా నియమించారు. ఈ మేరకు సంబంధిత పత్రాన్ని మంగళవారం ప్రకాశం భవనంలో జారీ చేశారు. ఈ నియామకం యొక్క ఉద్దేశ్యం దివ్యాశీగునికి మంజూరైన కుటుంబ పెన్షన్‌ను స్వీకరించడం, నిర్వహించడం, చట్టబద్ధ నిర్ణయాలు తీసుకోవడం, భద్రపరచడం.

**పరిమిత సంరక్షకుని బాధ్యతలు:** కుటుంబ పెన్షన్‌ను పూర్తిగా దివ్యాంగుని సంక్షేమం, సంరక్షణ, పోషణ, ప్రయోజనం కోసం మాత్రమే స్వీకరించి, నిర్వహించి, వినియోగించాలి. దివ్యాంగుని హక్కులు, గౌరవం.. ప్రయోజనాలను కాపాడుతూ, ఎల్లప్పుడూ అతని ఉత్తమ ప్రయోజనాల కోసం పనిచేయాలి. పెన్షన్ మొత్తాన్ని దుర్వినియోగం చేయకుండా, ఇతర అవసరాలకు మళ్లించకుండా, దివ్యాంగుని సంక్షేమం కోసమే ఉపయోగించబడేలా చూడాలి.

## కోమరోలులో ఈ నెల 24న కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

### టిడిపి కార్యాలయం





**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

గిద్దలూరు నియోజకవర్గం కోమరోలు లో 24న శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ విజయ సునీత , జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు జిల్లా అధికారులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక " ప్రజాదర్బార్ ఏర్పాటు చేయడం జరుగుతుందని , నియోజకవర్గం ప్రజలు అందరూ తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం కోవాలని గిద్దలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

### - నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### - జిల్లా కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

అంటువ్యాధులు ప్రబలకుండా చూడడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు హెచ్చరించారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన వ్యాధులపై జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. డయేరియా, వైరల్ ఫీవర్, ఫుడ్ పాయిజన్ వంటి కేసులు వెలుగుచూస్తున్న తీరుపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఏటా ఈ కేసులు క్రమంగా తగ్గాలని స్పష్టం చేశారు. ఈ దిశగా దృష్టి సారించాలని చెప్పారు. ముఖ్యంగా సంక్షేమ హాస్టళ్లలోని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆహార పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, పరిసరాలలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఆర్డిఏ పిడి నారాయణ, జిల్లా బిసి సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, డీఈవో రేణుక, డిపిఓ అనుపమ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పశు సంవర్ధక అధికారి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, అన్ని మున్సిపాలిటీల అధికారులు పాల్గొన్నారు.



## ముడి పొగాకుపై జీఎస్టీ 28 శాతానికి తగ్గించాలి

### - కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని పార్లమెంట్ లో కలిసి ముడి పొగాకు ( హెచ్ ఎస్ ఎన్ 2401) పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ముడి పొగాకు ( హెచ్ ఎస్ ఎన్ 2401)కు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఎఫ్ సి వి పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస రాజు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తీపాటి నాగరాజు, బీద మస్తానీ రావు, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లలో భారీ అవినీతి

### కాంట్రాక్టర్లకు రూ. కోట్లు కట్టబెడుతున్నారు: వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అశోక్ కుమార్

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 21**

రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్లు, పరికరాల సేకరణ పేరుతో ప్రభుత్వ పెద్దలు, విద్యుత్ సంస్థల అధికారులు కలిసి భారీ దోపిడీకి పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతూనే, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారనడానికి ప్రభుత్వ అనుకూల పత్రికలో ప్రచురితమైన కథనమే స్పష్టమైన నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. ఆ పత్రికలోనే ఇలాంటి వార్త వచ్చిందంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంతలా దిగజారిందో ప్రభుత్వాలు, అధికారులు పునరాలోచించుకోవాలని హితవు పలికారు.



**ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై లక్షల్లో లూటీ..**

ముందుగానే నిర్ణయించిన వ్యయ పట్టిక ప్రకారం 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ. 3,59,084 ఉండాల్సి ఉండగా, సీపీడీసీఎల్ అధికారులు మాత్రం ఏకంగా రూ. 5,30,130 వెచ్చించి కొనుగోలు చేశారని అశోక్ కుమార్ విమర్శించారు. కేవలం ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌పైనే రూ. 1,71,046 అదనంగా చెల్లించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని నిలదీశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం గుత్తేదారులకు అక్రమ లబ్ధి చేకూర్చేలా వ్యవహరించి, నిబంధనలకు విరుద్ధంగా అదనంగా రూ. 48.47 కోట్లు కట్టబెట్టారని ఆరోపించారు. కేవలం ట్రాన్స్‌ఫార్మర్లే కాకుండా విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, కేబుళ్లు, స్విచ్‌లను కూడా ఏపీఈఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా విపరీతమైన ధరలకు కొనుగోలు చేస్తూ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారని మండిపడ్డారు.

**సామాన్యులపై భారాలు..**

సామాన్యుల విద్యుత్ పై చిన్న చిన్న సర్దుబాట్లు చేసి ఛార్జీలు తగ్గించామని పత్రికల్లో గొప్పలు చెప్పుకోవడం సరికాదని అశోక్ కుమార్ అన్నారు. క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలపై విద్యుత్ ఛార్జీల మోత మోగుతుంటే, కాంట్రాక్టర్లకు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రూ. కోట్లు కట్టబెడుతున్న వైనంపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలి

### రైతులకు వ్యవసాయ అధికారి సైదా సూచనలు



**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 21**

రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.కె. సైదా సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పొలం పిలుస్తుంది" కార్యక్రమం మంగళవారం సంతమాగులూరు మండలంలోని కొప్పరం, సజ్జాపురం గ్రామాలలో నిర్వహించగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే పంట బీమా, పంట నష్టపరిహారం, సబ్సిడీలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయని, అందువల్ల ప్రతి రైతు తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ ద్వారా కూడా పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, శనగలు తదితర పంటలను సకాలంలో నమోదు చేయించుకోవాలని, వరి పంట ఈ-క్రాప్ నమోదుకు ఆగస్టు 15 వరకు, ఇతర పంటల నమోదుకు జూలై 31 వరకు గడువు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పురుగులు, తెగుళ్లు, పోషక లోపాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పి. సునీత, డి. మౌనిక పాల్గొని రైతులకు వివరాలు తెలియజేశారు.



## స్ప్రింగ్ బోర్డ్ పాఠశాలలో అవినీతి నిరోధక అవగాహన సదస్సు




**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

గిద్దలూరు స్ప్రింగ్ బోర్డ్ పాఠశాలలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్లోబల్ హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాగులూరి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ మాట్లాడుతూ, విద్యార్థులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండి నిజాయితీ, నైతిక విలువలు, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కుటుంబం, గ్రామం, సమాజం , దేశ అభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎక్కడ అన్యాయం జరిగినా ధైర్యంగా ప్రశ్నించే వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, ముఖ్యంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జెవి నారాయణ పాఠశాల డైరెక్టర్ మణిచైతన్య , మాగులూరి శ్రీకాంత్ ఫరక్ లనుఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాటిచ్చారు మాటనిలబెట్టుకున్నారు

### 72 గంటల్లో సమస్య పరిష్కారం చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

గిద్దలూరు నియోజకవర్గం గత వారం శనివారం నాడు కొమరోలు మండలం పోసుపల్లి, రెడ్డిచర్ల తదితర గ్రామానికి చెందిన విద్యార్థులు బస్సు సదుపాయం కల్పించాలన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని కోరిన వెంటనే స్పందించిన అశోకుడు ఆర్ టిసి మేనేజర్ మౌనిక తో మాట్లాడిన వెంటనే సోమవారం ఉదయం 7:00 గం " లకు బస్సు పోసుపల్లి నుండి బస్సు నడిపేవిధంగా ఆదేశాలు జారీచేశారు. ఆమెరకు ఆర్టిసి అధికారుల చర్యలు చేపట్టి సోమవారం నుండి ఆర్ టి సి బస్ నడిపారు ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని గ్రామ ప్రజలు , విద్యార్థుల బస్సు సమస్య ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని కలిసిన వెంటనే 72 గంటల్లో పరిష్కారం చేశారు అందుకుగాను విద్యార్థులు , గ్రామస్తులు తదితరులు సంతోషం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యే సార్ అని ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు.






# అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర





**మార్కాపురం పెన్ పవర్ జులై 21**

పట్టణంలో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ బంజారాహిల్స్ హైదరాబాద్ శ్రీ జగన్నాథ సీతారామ అన్న క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రథయాత్ర పట్టణంలోని దసరా మండపం నుండి ఆర్టీసీ బస్టాండ్ కోర్టు సెంటర్ మీదుగా చెన్నకేశవ స్వామి దేవస్థానం నుండి నాలుగు మాడ విధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. హరే రామ హరే కృష్ణ అనే సంకీర్తనతో వీధులన్నీ మారుమోగాయి.వేలాదిమంది భక్తులు శ్రీ జగన్నాథ స్వామినీ దర్శించుకున్నారు.అనంతరం జగన్నాథ స్వామి బలదేవ, సుభద్ర రథయాత్ర జరేగింది. వేలాది మంది భక్తులతో రథయాత్రలో పాల్గొని హరినామ సంకీర్తన చేస్తూ భక్తితో రథం లాగి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు పాహండి ఉత్సవము నిర్వహించారు. మహా మంగళహారతి, స్వామివారికి 108 రకముల నైవేద్యాలు సమర్పించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం -బొబ్బూరి రమేష్




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

ప్రజల సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ స్థానిక ఎస్టీ కాలనీ సమస్యలపై యానాది సంఘం సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను వివరించారు ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు ఎస్టీ కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే పూర్తి సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యానాది సంఘం సభ్యులు బొబ్బూరి రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, టిడిపి నాయకులు సంగిశెట్టి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు యానాది సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్ధవీడు 1 ఎంఈఓగా వెంకటేశ్వర రావు

**అర్ధవీడు, పెన్ పవర్, జూలై 21**



అర్ధవీడు 1 ఎంఈఓ గా యాగటీల వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో బయాలజీ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. ఈనెల 17వ తేదీన అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం, కుళ్ళిపోయిన గుడ్లను వడ్డించడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్ధవీడు 1 ఎంఈవో సుజాత, అర్ధవీడు 2 ఎంఈఓ లక్ష్మి నాయక్ లను సస్పెండ్ చేయడంతో వెంకటేశ్వరరావును ఎంఈఓగా నియమించారు.

# మండలంలోని రంగాపురం, యాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం

**అర్ధవీడు, పెన్ పవర్, జులై 21**

అర్ధవీడు మండలంలోని రంగాపురం, యాచవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సజ్జ మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సజ్జ మనోహర్ మాట్లాడుతూ రైతులందరూ ఖరీఫ్ 2026 పంట కాలము నందు వేసిన పంటలన్నీ పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. పంట నమోదు చేసుకోవడం వలన అతివృష్టి, అనావృష్టి వచ్చినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే పంట నష్టపరిహారం, పంటల భీమా, సబ్సిడీ పై విత్తనాలు, ఎరువులు, మద్దతు ధర, సున్న వడ్డీ తదితర ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకొని ఉండాలని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం నందు రైతులు స్వతహాగా వారే పంట బీమా కి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్లో జిల్లాలో వరి,కంది,సజ్జ, నువ్వులు మినుములు, ఎండుమిరప మొదలైన పంటలు(దిగుబడి ఆధారంగా), ప్రతి పంట(వాతావరణం ఆధారంగా)భీమా పథకం కింద వర్తిస్తాయని తెలిపారు.





పంట భీమా నందు ప్రతి ,కంది, సజ్జ,మినుములు, నువ్వులు, ఎండుమిరప కి 31 జులై వరకు, వరి పంటకి ఆగస్టు 15 వరకు, గడువు తేదీ అని తెలిపారు. పంట బీమా చేయదలచిన వారు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం, పంట ధృవీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని దగ్గర్లోని మీసేవ, సిఎస్సి సెంటర్, బ్యాంకులో మొదలైన వద్ద పంట భీమా కి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పైన పంటలు వేసిన ప్రతి ఒక్క రైతు కూడా పంట భీమా నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు ఎకరాకి రూ 860లు, కంది పంట ఎకరాకి రూ 430లు, సజ్జ పంట ఎకరాకి రూ 156లు, మినుములు ఎకరాకి రూ 205లు, నువ్వులు ఎకరాకి రూ 180లు, ఎండుమిరప ఎకరాకి రూ 4500లు , పత్తి ఎకరాకి రూ 2100లు అని తెలిపారు.రైతులకి పంట భీమా పథకం గురించి ఏమైనా సందేహాలు ఉన్నచో దగ్గర్లోని రైతు సేవా కేంద్రం ను సంప్రదించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు మరియు రైతులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

**గుడ్లూరు, పెన్ పవర్, జులై 21**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన కాలంలో ప్రభుత్వ రంగ ఆధ్వర్యంలో నిర్మించిన రామాయపట్నం పోర్టు ను కూటమి ప్రభుత్వం అత్యంత చౌకగా ప్రైవేటుపరం చేస్తుంటే కందుకూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్ చేశారు రామయపట్నం పోర్టు భూములు ఇచ్చిన రైతులు ఆశలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలిచిన వైఎస్ఆర్ నేతలపై కేసులు పెట్టడం అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు ప్రభుత్వ రంగాన్ని కాపాడలేని కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం తప్ప ఇంకేమి చేయలేదని విమర్శించారు. స్థానిక యువకులకు 70శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ పోర్టు ఆందోళనలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి లతో పాటుగా మరో ఐదుగురుపై వైఎస్సార్సీపీ నేతలపై ఆరోజు కేసు నమోదు చేయడం జరిగినది. అయితే కూటమినేతల ఒత్తిడి



వలన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలను కేసులు పెట్టి బెదిరించే ధోరణితో మరి కొంతమందిని టార్గెట్ చేస్తూ కేసులు నమోదు చేశారు. కొంతమంది వైయస్సార్ పార్టీ నాయకులను పిలిపించి కేసులో చేర్చడం జరిగినది. ఈరోజు హాజరైన వారిలో కాపులూరి కృష్ణ అనుములు లక్ష్మీ నరసింహం, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫీ, గొర్ల రమేషు,వెలిచెర్ల ధన కోటేశ్వరరావు, బిల్లా రమణయ్య ,కాపులూరి మధుసూదన్, దామా.రమేషు, నల్లమోతు చంద్రమౌళి,అప్పన బోయిన రాజేష్, చేపల బాలాజీ, కానాల శివప్రసాద్, షేక్.నయుమ్, మల్లికార్జున రెడ్డి, షేక్ కరీం తదితరులు ఉన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

స్కానింగ్ కేంద్రంలో తనిఖీ డెకాయ్ ఆపరేషన్ తప్పక నిర్వహించాలని, లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోపిరియట్ అథారిటీ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జరిగినది. ఈ కమిటీ మీటింగ్ లో డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్ప్రోప్రేయర్ అథారిటీ పిసి పిఎన్ డిటి యాక్ట్ జిల్లా జడ్జి ఫ్యామిలీ కోర్టు జి.దీన, ఎస్ డి.పి ఓ ఆర్. శ్రీనివాసరావు, జిల్లా వైద్య.. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోపియాట్ అథారిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సెక్స్ రేషియో తక్కువగా ఉన్న మండలాల్లో అవగాహన కార్యక్రమాలు వైద్య శాఖ సిబ్బంది ద్వారా నిర్వహించాలని తెలిపారు.

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**

స్కానింగ్ సెంటర్లలో రేట్ల వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆడపిల్లల పట్ల వివక్ష మూఢనమ్మకాలు సామాజిక అపోహాలు ఉండరాదని తెలిపారు. జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి దీన మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ కేంద్రాలను వైద్యశాఖ అధికారులు టీములు గా ఏర్పడి తనిఖీలు చేయాలని తెలిపారు. భ్రూణ హత్యలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రజలకు స్త్రీ పురుషులు సమాజంలో సమానమని తెలిపారు. డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి లింగ నిర్ధారణ చేసిన డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి లింగ నిర్ధారణ చేసిన కేంద్రాలపై కఠిన చర్యలు చట్ట ప్రకారం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆడ శిశువు జననం కుటుంబానికే కాక సమాజానికి కూడా అవసరం ఉందని తెలిపారు. ఎస్ డి పి ఓ ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య.. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలను పనిచేయు తీరును కొత్త స్కానింగ్ కేంద్రంలో ఏర్పాటు రెన్యువల్స్, మోడిఫికేషన్ గురించి వివరించారు. జిల్లాలో టంగుటూరు మండలం, మర్రిపూడి మండలంలో లింగ నిష్పత్తి తక్కువగా ఉందని అక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బెల్లం నర్సింహారావు, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి కే.ఏ. రాజు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంకాలమ్మ తల్లికి సారె సమర్పణ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

మండలంలోని వెంగనగుంట గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత అంకాలమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గ్రామ మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆషాఢ మాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఇర్ల వెంకటాద్రి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు అనుకూల వాతావరణం నెలకొని పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతను ప్రార్థిస్తూ సారె కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ శ్రేయస్సు, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎస్ఎస్ఎఫ్ అర్చకులు బొబ్బా రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు పంచాంగంలో ఆషాఢ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ఈ నెలలో అమ్మవారికి సారె సమర్పించి మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించడం వల్ల గ్రామానికి శుభఫలితాలు చేకూరడంతో




పాటు కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని తెలిపారు. అలాగే దోష నివారణ హోమాలు నిర్వహించడం ద్వారా కుటుంబాల్లోని అనేక సమస్యలు తొలగుతాయని వివరించారు. ఆషాఢ మాస సారె సమర్పించిన కార్యక్రమంలో మండల మహిళా సహా కన్వీనర్ జి మహాలక్ష్మి, మాతాజీ డి శ్యామల, గ్రామ ధార్మిక సమితి సభ్యులు, ఖండ ధర్మ ప్రసారక్ ఎం అచ్యుత రావు, గ్రామ మహిళలు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా పెదగోగులపల్లి ఎస్సీ కాలనీ ఆరెపాలెం ఎస్సీ కాలనీలలో సమస్యలపై అధ్యయనం చేశారు గోగులపల్లి ఎస్సీ కాలనీ వాసులకు స్మశాన స్థలము 10 సెంట్లు మాత్రమే ఉంది వేసిన చోటే మళ్లీ మళ్లీ శవాలు పూడ్చి పెట్టాల్సిన దుస్థితి నెలకొని ఉన్నదని పార్టీలు మారిన రాజకీయ నాయకులు మారిన మా బ్రతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బృందానికి చెప్పారు.దాదాపు 30 మందికి ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని బృందానికి తెలియజేశారు మంచినీళ్లు కూడా ఒక దాత ఏర్పాటు చేసిన బోరుబావి నుండి వాడుకుంటున్నామని చెప్పారు ఆరెపాలెంలో మంచినీటి సమస్య ఉన్నది ప్రస్తుతం కొండ దగ్గర వేసిన బోర్డు నుండి నీరు సరఫరా నేరుగా ఇండ్లవద్ద ఉన్న కుళాయిలకే వస్తున్నవి ఆ కాలనీకి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు పైప్ లైన్ కూడా పూర్తయింది ఇంకా ట్యాంక్ ని వినియోగంలోకి తీసుకురాలేదు అది వినియోగంలోకి తీసుకొస్తే అందరి నీటి సమస్య పరిష్కారం అవుతుంది కొన్నిచోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నవి ఈ అధ్యయన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కేవిపిఎస్ మండల కార్యదర్శి బక్క జేసురత్నం పాల్గొన్నారు.

# 23న విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు

## ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

**గిద్దలూరు పెన్ పవర్ జులై 21**

కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం ( సీజీఆర్ఎఫ్ ) విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు ను ఈ నెల 23 న నిర్వహించనున్నట్లు మార్కాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి. నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్ ఒంగోలు రోడ్డు లోని తిరుమల కన్వెన్షన్ హాల్ గిద్దలూరు నందు గురువారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు .సీజీఆర్ఎఫ్ చైర్పర్సన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు డి. కృష్ణ నాయక్ , ఆర్థిక సభ్యులు కే. కృష్ణ , మార్కాపురం జిల్లా పర్యవేక్షణ అధికారి షేక్ అబ్దుల్ కరీం స్వతంత్ర సభ్యులు ఏ. సునీత విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. మార్కాపురం డివిజన్ లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను వ్రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబరు, పూర్తి అడ్రస్, మొబైల్ ఫోన్ నెంబర్ తో అర్జీ ఇచ్చి సమస్య పరిస్కరిం చుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి. నాగేశ్వర రావు కోరారు.

# అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

**తహసిల్దార్ కె ధర్మ తేజ**



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

మండల కేంద్రంలోని సి. ఎస్. పురం తహసిల్దార్ కార్యాలయంలో "ఒక నెల-ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా గత నెలలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పురోగతిపై మండల తహసిల్దార్ మంగళవారం వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలు, పరిష్కారం దిశగా జరిగిన పురోగతిని ఒక్కొక్క వీఆర్వోను అడిగి తెలుసుకుని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హత మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భూములకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి, అర్హులైన భూ యజమానుల మ్యుటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రీన్ ఫీల్డ్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతుల పూర్తి వివరాలను సేకరించి, సమగ్ర జాబితాను సిద్ధం చేసి సంబంధిత ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. రైతులకు సంబంధించిన వివరాల్లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 15 మంది మందుబాబులకు జరిమానా

**- ట్రాఫిక్ సీఐ హజరతయ్య వెల్లడి**

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

వాహనాల తనిఖీలలో భాగంగా మంగళవారం ట్రాఫిక్ పోలీసు వారు వాహనాలు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హజరతయ్య తెలిపారు. 15 మందిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్క వాహనదారుని కి పదివేల రూపాయలు చొప్పున (మొత్తం రూ. 1,50,000 లు) జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.



# మై భారత్ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలి

## – జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 20**

మై భారత్ సేవలపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. యువత పెద్ద సంఖ్యలో ఇందులో నమోదు అయ్యేలా చూడాలన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. మై భారత్ విభాగం ఏర్పాటు, దీనివలన యువతకు, సమాజానికి కలిగే ప్రయోజనాలను జిల్లా యూత్ ఆఫీసర్ నరసింహ కుమార్ వివరించారు. యూత్ క్లబ్స్ ఏర్పాటు, సామాజిక, స్వచ్ఛంద కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేయటం, వివిధ సమకాలీన అంశాలపై అవగాహన కల్పన – పోటీలలో విజేతలకు ప్రధానమంత్రిని కలిసే అవకాశం కల్పించడం, జిల్లాలో ఉపాధికి ఉన్న అవకాశాలను వారికి తెలియజేయడం, ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కల్పించడం, వివిధ రంగాలలో నిపుణులతో చర్చించే అవకాశం కల్పించడం వంటి అనేక విషయాలలో యువతకు తోడుగా ఉండేలా మై భారత్ కార్యక్రమాలను కేంద్ర యువజన వ్యవహారాల శాఖ చేపట్టిందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రకాశం జిల్లా యువత కూడా ఆయా విషయాలలో చురుకైన పాత్ర పోషించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. స్వతహాగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా మై భారత్ మొబైల్ యాప్ ను 15 – 29 ఏళ్ల యువత కచ్చితంగా డౌన్లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో ఈ దిశగా పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సమన్వయ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈఓ చిరంజీవి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డీఈవో రేణుక, డిఆర్డిఏ పి.డి. నారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్.డి.ఎం. రమేష్, స్టెప్ సీఈవో అర్జున్ నాయక్, జిల్లా నైపుణ్య అధికారి రవితేజ, ఉపాధి కల్పన అధికారి ( ఇంచార్జి ) ఇందిరా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# హోం మంత్రి అనిత పై అంబటి వ్యాఖ్యలు గర్హనీయం




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి అనితపై మాజీ మంత్రి అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమ్మార్పీఎస్ సంయుక్తంగా ప్రదర్శన నిర్వహించాయి. అంబేద్కర్ భవన్ నుండి చర్చి సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చొట్ట నరేంద్ర మాదిగ మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మహిళలంటే చులకన భావం అని విమర్శించారు. హోం మంత్రి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, టి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

### –28 లోగా అభ్యంతరాలను తెలియ చేయాలని సూచన

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 21**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో 2025–26 సంవత్సరానికి దివ్యాంగుల ప్రత్యేక ఉద్యోగాల నియామకాలలో భాగంగా గ్రూప్–×ం, గ్రూప్ –×ం, కానివి ( క్లాస్–×ం) విభాగాలు కు సంబంధించి 42 బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి పోస్టుల వారీగా, దివ్యాంగుల విభాగాల వారీగా సాధారణ తాత్కాలిక జిల్లా అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచడమైనదని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులు తమ పేరు, పోస్టు, దివ్యాంగుల కేటగిరీ, విద్యార్హతలు, ఉద్యోగ సీనియారిటీ, మెరిట్ స్థానం, ఇతర వివరాలను జిల్లా వెబ్ సైట్ లో పరిశీలించుకోవలసిందిగా తెలియజేశారు. సదరు ప్రొవిజినల్ మెరిట్ జాబితాలలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత ఆధార పత్రాలతో కూడిన తమ అభ్యంతరాలను జూలై 22 నుండి తేదీ 28 సాయంత్రం 5.00 గంటల లోపు ప్రకాశం భవనం లో గల సహాయ సంచాలకులు, దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ప్రకాశం జిల్లా, ఒంగోలు కార్యాలయానికి స్వయంగా గానీ, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గానీ సమర్పించవలసిందిగా కోరారు. నిర్దేశించిన గడువు అనంతరం అందిన అభ్యంతరాలు లేదా సరైన ఆధార పత్రాలు లేకుండా సమర్పించిన అభ్యంతరాలు ఏ పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకొనబడవని తెలిపారు. అభ్యంతరాలు వారి వ్యక్తిగత దరఖాస్తు మాత్రమే సమర్పించాలని, ఇతర అభ్యర్థులు పై ఇచ్చిన ఎటువంటి అభ్యంతరాలు పరిగణనలోనికి తీసుకోనబడువని తెలిపారు. కావున, అభ్యర్థులు అభ్యంతరాలు ఏమైనా ఉంటే నిర్ణీత సమయంలో అందజేయాలని, సందేహ నివృత్తి కొరకు 08592–281310 కార్యాలయ ఫోన్ నెంబరను పని వేళలో సంప్రదించాలని కోరారు.

# జయ హనుమంత జ్ఞాన గుణ సాగర

### – శ్రీగిరిలో అభయాంజనేయ స్వామివారి ఆగమన ఆరాధనోత్సవాలకు శ్రీకారం





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 21**

శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు మంగళ వారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి వారికి విశేష అర్చన అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు మధుర గాయకులు వి వి ఎస్ వినోద్ కుమార్ గాత్ర కచేరీ భక్తులకు వీనుల విందు చేసింది. హనుమత్సంబంధమైన పలు కీర్తనలను వినోద్ కుమార్ మృదు మధురంగా ఆలపించి భక్తులను తన్మయులను చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు గాయకుడు వినోద్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు. అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలలో భాగంగా 22 వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు హనుమత్ యాగం, పూర్ణాహుతి, సాయంత్రం 6.30 లకు భక్తులచే విష్ణు సహస్ర నామ పారాయణ జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

# సిఐ వినోద్ కుమార్ ను కలిసిన పాములపాటి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ మంగళవారం పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా తో సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పామూరు మండల మాజీ టిడిపి అధ్యక్షులు డోల శేషాద్రి, నారాయణస్వామి కాకతీయ కమ్మ వారి అన్నదాన సత్రం కమిటీ సభ్యులు రాయి రాజేంద్రప్రసాద్, చావా వెంకటేశ్వర్లు, చావా వేణు గోపాల్, గడ్డం శ్రీనివాసరావు, దారపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ లేని బడి ఈడు పిల్లలు

### చెరుకుపల్లి వెంకటరెడ్డి చొరవతో ఆధార్ నమోదుకు చర్యలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం ఎస్టీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 12 మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందకపోతున్న విషయం వెలుగులోకి రావడంతో కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మండల తహసీల్దార్ కె. ధర్మతేజను కలిసి విద్యార్థుల పరిస్థితిని వివరించారు. అనంతరం వారికి అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయించి ఆధార్ నమోదు ప్రక్రియకు మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేవని తల్లిదండ్రుల నిరక్షరాస్యత, అవగాహన లోపం, నిర్లక్ష్యం వంటి కారణాలతో కొంతమంది చిన్నారులు పాఠశాలకు కూడా దూరంగా ఉన్నారని చెప్పారు. 'బడి పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ జె. ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు లక్కిపోగు ఆంటోనీ గ్రామాల్లో పర్యటించి పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం అభినందనీయమన్నారు. ఆధార్ కార్డులు పూర్తయిన అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే తల్లికి వందనం పథకం మరియు విద్యాభివృద్ధికి అందజేసే పథకాలన్నీ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రధానోపాధ్యాయులు ఆంటోని మాట్లాడుతూ ఆధార్ కార్డు లేకపోవడం వల్ల విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన వెంకటరెడ్డిని అభినందించారు.

# రైతులకు చేరువ కానున్న వ్యవసాయ సమాచారం

### ప్రతి మంగళ బుధవారాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 21**

ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయుటకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించ నున్నట్లు మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు. మండలంలోని పెద్దగోగులపల్లి , ఆర్ కె పల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులతో కలిసి సజ్జ మరియు మొక్కజొన్న తోటలను పరిశీలించి పాటించాల్సిన మెలుకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పి మధుబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరి, కంది, సజ్జ, ఎండు మిరప, మినుము సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.860 రూపాయల ప్రీమియంను ఆగష్టు 15వ తేదీ లోపల చెల్లించినట్లయితే ఎకరానికి 43,000 రూపాయల భీమా పొందుటకు అర్హులని తెలిపారు. అలాగే ఎకరా కంది పంటకు రూ.430, సజ్జ పంటకు రూ.156, మిరప పంటకు రూ.4500, మినుము పంటకు రూ.205 ప్రీమియం చెల్లించి జులై 31వ తేదీ లోపు పీఎంఎఫ్ బీవై. జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకున్నట్లయితే ఒక ఎకరా కంది పంటకి రూ.21,500 రూపాయలు, సజ్జ పంటకి రూ.15,600 రూపాయలు, మిరప పంటకి రూ.90వేలు, మినుముకు రూ.20,500 రూపాయల భీమా పొందవచ్చన్నారు. పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి , గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కురపల్లి దుర్గాలమ్మ తల్లి మహోత్సవాలు

***వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపుతో ఆధ్యాత్మిక వాతావరణం***

**పద్మనాభం, పెన్ పవర్ జూలై 21**

పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పరిధిలోని కురపల్లి గ్రామంలో శ్రీ దుర్గాలమ్మ తల్లి పండుగ మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు రెండు వారాల ముందుగానే ఉత్సవాలకు ఏర్పాట్లు చేసి, సంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాలను నిర్వహించారు. పండుగలో భాగంగా ఆదివారం మర్రి మొక్కడం, సోమవారం తొలి పూజలు నిర్వహించగా, మంగళవారం ప్రధాన పూజలు, ఘటాల ఊరేగింపు వైభవంగా సాగాయి. ఉదయం అమ్మవారి ఘటాన్ని దేవుడి ఇంటి నుంచి గ్రామమంతా ఊరేగించి తిరిగి తీసుకువచ్చారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, బాణాసంచా ప్రదర్శనల నడుమ అమ్మవారి ఘటాన్ని ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకొని ఆశీర్వాదాలు పొందారు. ఈ మహోత్సవాలకు కురపల్లి గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

# పశు పోషకులకు మెరుగైన సేవలు అందించాలి -ఏడి సుదర్శన్ రావు



**సి.ఎస్.పురం,పెన్ పవర్ జూలై 21**

సి.ఎస్.పురం ఏరియా పశు వైద్యశాలకు నూతనంగా పదోన్నతిపై అసిస్టెంట్ డైరెక్టర్ గా పి. సుదర్శన్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పామూరు, సి.ఎస్.పురం పశు వైద్యశాలల వైద్యులు డాక్టర్ షేక్ మునీర్, డాక్టర్ హనుమాన్ మరియు పశు వైద్య సిబ్బంది పి. సుదర్శన్ రావును శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అనంతరం పశు సంవర్ధక శాఖ నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పామూరు, సి.ఎస్.పురం మండలాల పశు వైద్య సిబ్బందిని ఆయన పరిచయం చేసుకొని, శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పశువైద్య సేవల అమలు, రైతులకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పి. సుదర్శన్ రావు మాట్లాడుతూ పశుపోషకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పశుసంవర్ధక పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని, పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ షేక్ మునీర్, హనుమాన్ , పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

# సింహాచలం గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

### 32 కి.మీ మార్గంలో భద్రత, సహాయ కేంద్రాలు, డ్రోన్ నిఘా.. తొలిసారి ఆర్ఎఫ్ఐడీ ట్యాగులు

**సింహాచలం, పెన్ పవర్ జూలై 21**

ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ తదితర అధికారులు 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. మార్గమంతా రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి పావంచ వద్ద ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్తో పాటు మార్గంలో 30 సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. భక్తుల భద్రత కోసం 18 డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా తొలిసారిగా ఆర్ఎఫ్ఐడీ ట్యాగులు అందుబాటులోకి తీసుకురానున్నారు. చైన్ స్నాచింగ్ల నివారణకు ప్రత్యేక పోలీసు బృందాలు విధులు నిర్వహించనున్నాయి. గిరి ప్రదక్షిణ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. భక్తులు, ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ఈవో జల్లేపల్లి వెంకటరావు మాట్లాడుతూ, భక్తులు ప్రశాంతంగా గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## రోహిత్ మాటలు అప్పట్లో నమ్మలేదు.. ప్రపంచకప్‌లో అదే నన్ను మార్చింది: సంజూ శాంసన్

- టీ20 ప్రపంచకప్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సంజూ
- ఆరంభ మ్యాచుల్లో ఎంపిక చేయకపోవడంతో నిరాశకు గురైనట్లు వెల్లడి
- రోహిత్ ధైర్యం చెప్పినా నమ్మలేకపోయానన్న శాంసన్
- క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నట్లు వెల్లడి
- అదే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్న సంజూ
- న్యూజిలాండ్ సిరీస్ పెద్ద గుణపాఠం నేర్పిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్–2026లో తొలుత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన తర్వాత ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించడంతో తన ప్రపంచకప్ అవకాశాలు ముగిసిపోయాయని భావించినట్లు చెప్పాడు. ఆ సమయంలో రోహిత్ శర్మ ధైర్యం చెప్పినా తాను ఆ మాటలను నమ్మలేకపోయానని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు.ప్రపంచకప్ ప్రారంభమైన తొలి నాలుగు, ఐదు రోజులు ఆ నిరాశ నుంచి బయటపడలేకపోయానని సంజూ చెప్పాడు. ఆ తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని.. అసలు తాను క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నానని వివరించాడు. అదే తనలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, మానసికంగా బలంగా మారేందుకు దోహదపడిందని పేర్కొన్నాడు.

వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు మరింత మెరుగ్గా సిద్ధమయ్యానని సంజూ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ప్రతి షాట్ సహజంగానే వచ్చిందని, అది తన కెరీర్‌లో ప్రత్యేకమైన ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని అన్నాడు. వికెట్లు పడుతుండటంతో సాధారణ ఆటతీరును మార్చుకుని పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేశానని వివరించాడు.ఇక న్యూజిలాండ్ సిరీస్ తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని సంజూ చెప్పాడు. ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే ముఖ్యమని తన భార్య చెప్పిన మాటలు అప్పుడే అర్థమయ్యాయని పేర్కొన్నాడు. తాను సాధించిన విజయాల్లో దేవుడి ఆశీర్వాదమే ఎక్కువని, ఆ ప్రపంచకప్ ఇన్నింగ్స్ జీవితాంతం గుర్తుండిపోతుందని సంజూ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.

# గంభీర్ కూడా బాధ్యత తీసుకోవాల్సిందే.. టీమిండియా ఓటమిపై మాజీ కెప్టెన్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఓటమి తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు యాజమాన్యంపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర విమర్శలు చేశారు. వరుసగా జట్టులో మార్పులు చేయడం, సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఇలాంటి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. 2027 ప్రపంచకప్‌కు ఇలాగే సిద్ధమైతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2–1తో కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించారు. జింబాబ్వే, శ్రీలంక, వెస్టిండీస్‌లాంటి జట్లపై విజయాలు సాధిస్తేనే భారత జట్టు మళ్లీ ఫామ్‌లోకి వచ్చిందని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. బలమైన జట్లపై గెలిచినప్పుడే అసలు ప్రమాణం తెలుస్తుందని పేర్కొన్నారు. టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు గంభీర్ కూడా ఈ ఫలితాలకు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వన్డే ప్రపంచకప్‌కు ముందు చాలా తక్కువ మ్యాచ్‌లు మాత్రమే ఉండటంతో ఇప్పుడైనా స్థిరమైన జట్టును తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు.లార్డ్స్ వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌పైనా శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే సమయంలో కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపడం అర్థంలేని నిర్ణయమన్నారు. రోహిత్ శర్మ ఔటైన వెంటనే విరాట్ కోహ్లీకి తోడుగా రాహుల్‌ను పంపాల్సిందని అభిప్రాయపడ్డారు. 2023 ప్రపంచకప్‌లో కోహ్లీతో కలిసి రాహుల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన విషయాన్ని గుర్తు చేశారు. మ్యాచ్ దాదాపు చేజారిపోయిన తర్వాత అతణ్ని క్రీజులోకి పంపడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు.

## రోహిత్, కోహ్లీలను జట్టు నుంచి తీయడం అసాధ్యం: అశ్విన్

- రోహిత్, కోహ్లీలను జట్టు నుంచి తొలగించడం దాదాపు అసాధ్యమన్న అశ్విన్
- వారి అద్భుతమైన రికార్డులు, అభిమానుల మద్దతే ఇందుకు కారణమని వెల్లడి
- బ్యాటర్లతో పోలిస్తే బౌలర్లను తొలగించడం సులభమని వ్యాఖ్య
- భవిష్యత్తులో బౌలర్లకు కూడా అలాంటి మద్దతు లభించాలని ఆకాంక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టులోని సీనియర్ స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను జట్టు నుంచి తొలగించడం దాదాపు అసాధ్యమని టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. వారి అద్భుతమైన ట్రాక్ రికార్డులు, అపారమైన అభిమాన గణమే ఇందుకు ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించాడు.తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై జరుగుతున్న చర్చపై ఆయన స్పందిస్తూ.. వన్డే ఫార్మాట్‌లో కొనసాగాలని రోహిత్, కోహ్లీ భావిస్తే, వారిని జట్టు నుంచి తప్పించడం అటు మేనేజ్‌మెంట్‌కు గానీ, ఇటు సెలెక్టర్లకు గానీ అంత సులభం కాదని పేర్కొన్నారు. లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో రోహిత్ అజేయ సెంచరీతో (138) విమర్శలకు దీటైన సమాధానమిచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశాడు."ముందుగా వారికున్న అద్భుతమైన ట్రాక్ రికార్డును గమనించాలి. రోహిత్ వన్డేల్లో దాదాపు 12,000 పరుగులు సాధించారు. రెండోది, వారిద్దరూ అగ్రశ్రేణి స్టార్ బ్యాటర్లు. వారి ఆటను వీక్షించేందుకే లక్షలాది మంది అభిమానులు స్టేడియాలకు తరలివస్తారు. అటువంటి ఆటగాళ్లను జట్టు నుంచి తొలగిస్తే తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వస్తుంది," అని అశ్విన్ వివరించాడు.

అయితే, బ్యాటర్ల విషయంలో ఉన్న ఈ సానుకూల పరిస్థితి బౌలర్లకు ఉండదని అశ్విన్ పేర్కొన్నాడు. మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్ వంటి స్టార్ బౌలర్లను జట్టు నుంచి తప్పించినప్పుడు, బ్యాటర్ల విషయంలో వచ్చినంతగా ప్రజా వ్యతిరేకత రాదని ఆయన అభిప్రాయపడ్డాడు. భవిష్యత్తులో బౌలర్లకు కూడా ఇదే స్థాయి అభిమాన మద్దతు లభించాలని, వారి ఎంపిక కూడా సెలెక్టర్లకు కష్టతరంగా మారాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపాడు.

# స్పిరిట్ క్రేజీ అప్ డేట్ ఏంటంటే?



రెబా మోనికా జాన్ యొక్క ఫ్యాషన్ అలలు సృష్టిస్తోంది




పాన్–ఇండియా స్టార్ ప్రభాస్ – సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా –స్పిరిట్– తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో? చెప్పాల్సిన పనిలేదు. దీంతో సినిమా ఎప్పుడెప్పుడు? ప్రేక్షకుల ముందుకొస్తుందని ఆసక్తి అంతకంతకు పెరిగిపోతుంది.ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రం గురించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 40 శాతం పూర్తయిందని సందీప్ రెడ్డి వంగా వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ ప్రక్రియ ఇప్పటికే వేగంగా కొనసాగుతోందని.. సినిమాలోని కీలకమైన సన్నివేశాలను, యాక్షన్ ఘట్టాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. 40 శాతం షూటింగ్ పూర్తి కావడం అంటే? నిర్మాణ బృందం పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోందనడానికి నిదర్శనం. ప్రభాస్ లుక్ ..క్యారెక్టరైజేషన్ విషయంలో సందీప్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారని రోజులుగా ప్రచారం జరుగుతోంది. సాధారణంగా సందీప్ సినిమాల్లో హీరోల పాత్రలు చాలా ఇంటెన్స్‌గా, ఎమోషనల్‌గా ఉంటాయి. ప్రభాస్ వంటి మాస్ ఇమేజ్ ఉన్న నటుడు ఎలాంటి పాత్రలో ఎలా కనిపించబోతున్నాడనేది ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగిస్తోంది.

ఇప్పటికే పూర్తయిన 40 శాతం షూటింగ్‌లో ప్రభాస్ నటించిన సీన్లు చాలా పవర్‌ఫుల్‌గా వచ్చాయని చిత్ర వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. సాంకేతికపరంగా స్పిరిట్ హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో రూపొందుతోందని తెలుస్తోంది. భారీ సెట్లు, అత్యాధునిక కెమెరా పనితనం , నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. సందీప్ రెడ్డి వంగా ప్రతి సినిమాకు సంగీత దర్శకులతో ప్రత్యేకమైన శబ్దాలను రూపొందిస్తారు. ఈ చిత్రానికి కూడా ఆయన మ్యూజిక్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన భాగం షూటింగ్ కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి ఇండియాలోనే వివిధ లోకేషన్లలో జరుగుతోంది.విదేశీ లోకేషన్ల వరకూ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో 60 శాతం షూటింగ్ లో కొంత భాగం విదేశాల్లో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సాధారణంగా సందీప్ విదేశీ షూటింగ్ లకు పెద్దగా ప్రాధాన్యతనివ్వరు. వీలైనంత వరకూ ఇండియాలోనే చుట్టేస్తారు. –అర్జున్ రెడ్డి–, –యానిమల్– షూటింగ్ లు ఇండియాలోనే జరిగాయి. వాటిలో పాటలకు కూడా పెద్దగా ప్రాధాన్యత లేదు కాబట్టి విదేశీ లోకేషన్ల అవసరం పడలేదు. మరి –స్పిరిట్– విషయంలో విదేశీ లోకేషన్ల ఛాన్స్ ఎంత వరకూ తీసుకుంటారు? అన్నది తేలాల్సి ఉంది.



సుప్రీత వార్డ్‌రోబ్ మీకు కావాల్సినవన్నీ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com